# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం | 14 సెప్టెంబరు, 2026 | పేజీలు :06


## త్వరలో కరీంనగర్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం



# వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

సిఐ రాం నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/ధర్మపురి:** ధర్మపురి మండల పరిధిలో రానున్న వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు వినాయక మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్ఐ సాధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ఠ, పూజలు, ఊరేగింపు, నిమజ్జనం సమయంలో పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.మండపాల వద్ద విద్యుత్, అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని,వీలైనంత వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాలంటీర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు.డీజేలు,అధిక శబ్దం ద్వారా ప్రజలకు ఇబ్బంది కలిగించరాదని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. నిమజ్జన సమయంలో పోలీసుల సూచించిన మార్గం, సమయం, భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, గొడవలకు పాల్పడటం, రెచ్చగొట్టే నినాదాలు చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, పాత వీడియోలు,నిర్ధారణ లేని లేదా రెచ్చగొట్టే పోస్టులను ప్రచారం చేయవద్దని, ఏదైనా సమస్య తలెత్తితే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ కోరారు.మత సామరస్యం,సోదరభావంతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖకు సహకరించాలని నిర్వాహకులను కోరారు.

# లిక్కర్ వ్యాపారానికి అక్రమ టెండర్



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** గ్రామాభివృద్ధి కమిటీల పేరుతో వీడీసీలు చేస్తున్న అక్రమ కార్యకలాపాలకు అంతే లేకుండా పోయింది. వేంపల్లి గ్రామంలో అక్రమ టెండర్లు వేయొద్దని గతంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశాడు. కానీ జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసిన గాని అధికారుల ఆదేశాలు తమకు పట్టవ్ అంటూ గ్రామ నడి ఒడ్డున లిక్కర్ వ్యాపారానికి అక్రమంగా టెండర్ నిర్వహించారు. గ్రామంలో ఆదివారం నిర్వహించిన బహిరంగ వేలంలో గ్రామానికి చెందిన మహిళ గ్రామంలో అక్రమంగా టెండర్లు వేయొద్దని వారితో వాగ్వివాదానికి దిగిన వీడియో వైరల్‌గా మారింది.అక్రమ టెండర్లను అడ్డుకోవాల్సిన పోలీసులు పట్టించుకోకపోవడంతోనే గ్రామాలలో వీడీసీలు ఆగడాలు రోజురోజుకు పెరుగుతున్న మామూలుగానే తీసుకుంటున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు వీడిసి ఆగడాలపై అడ్డుకట్ట వే స్తారా లేక పక్కనే ఉంటూ ప్రోత్సహిస్తారో చూడాలి మరి.

## జ్యోతినగర్ ఫార్మసీని ప్రారంభించిన మేయర్ కొలగాని

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్:** కరీంనగర్ నగరంలోని జ్యోతినగర్ పాత డిఐజి బిల్డింగ్ చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన జ్యోతినగర్ ఫార్మసీని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, స్థానిక కార్పోరేటర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలకు అత్యవసర సమయాల్లో మందులు అందుబాటులో ఉండేలా 24 గంటల సేవలతోపాటు హోమ్ డెలివరీ సదుపాయాన్ని కల్పించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. నాణ్యమైన ఔషదాలను సరసమైన ధరలకే అందిస్తూ రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని ఫార్మసీ నిర్వాహకులకు సూచించారు. ఈ మెడికల్ షాప్ ద్వారా 24 గంటల పాటు మందులు విక్రయాలతోపాటు ఇంటి వద్దకే మందులను చేరవేసే హోమ్ డెలివరీ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అత్యవసర సేవల కోసం 79933 47247 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఫార్మసీ యాజమాన్యం, స్థానిక ప్రముఖులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## సిద్దిపేట అభివృద్ధిపై కాంగ్రెస్ అక్కసు



# మట్టి వినాయకులను ప్రతిష్ఠించుకొని పర్యావరణాన్ని రక్షించాలి

## తుల ఉమ, జిందం కళ చక్రపాణి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** వినాయక చవితి పర్వదినం సందర్భంగా సాధ్యమైనంత వరకు మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్టించుకోవాలని పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంలో భాగం కావాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జడ్పి చైర్‌పర్సన్ తుల ఉమ, సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి అన్నారు. ఆదివారం సిరిసిల్ల గాంధీ చౌక్‌లో బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ రసాయన రంగులతో తయారైన వినాయక విగ్రహాలను ప్రతిష్టించడంతో ఆ విగ్రహాలు వినాయక నిమజ్జనం తర్వాత నీటిలో సరిగా కరగక పర్యావరణానికి హాని కలిగించే అవకాశం ఉందని అన్నారు. మనం బాగుండాలని మన కుటుంబాలు బాగుండాలని మన చుట్టూ ఉన్నవారందరితోపాటు సమాజం బాగుండాలని అన్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే వినాయక చవితి పర్వదినం పురస్కరించుకొని ఎంత పెద్ద విగ్రహాలు పెట్టామని కాకుండా పర్యావర ణ పరిరక్షణ కోసం పోటీపడి మట్టి విగ్రహాలను ప్రతిష్టించుకొని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములమై మన భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అం దించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూ డూరి ప్రవీణ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్, పట్టణ కార్యదర్శి రవి, రామ్మోహన్, కౌన్సిలర్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో 4,268 కేసుల పరిష్కారం

**ప్రజాపక్షం/కరీంనగర్:** జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధి లోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులను వేగవంతంగా పరిష్కరించేందుకు చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయని, శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 4,268 కేసులు పరిష్కరించబడ్డాయని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌కు ముందు నిర్వహించిన ప్రీ–నేషనల్ లోక్ అదాలత్ ప్రక్రియలో 374 కేసులు, 12వ తేదిన జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 77ఎఫ్ ఐఆర్ కేసులు పరిష్కరించబడ్డాయని, దీంతో మొత్తం 451 ఎఫ్‌ఐఆర్ కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. అదేవిధంగా, వాహన ప్రమాదాలు/ఇతర సంబంధిత కేసులకు సంబంధించిన 1,019 కేసులు, మోటార్ వెహికల్ కేసులు 2,798 పరిష్కరించబడ్డాయని, మొత్తంగా 4,268 కేసులకు పరిష్కారం లభించిందన్నారు. జాతీయ లోక్ అదాలత్ ప్రక్రియలో సైబర్ క్రైమ్‌కు సంబంధించిన 29 ఎఫ్‌ఐఆర్ కేసులు, 5 నాన్ ఎఫ్‌ఐఆర్ కేసులు కూడా పరిష్కరించబడ్డాయని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి సహకరించిన న్యాయ వ్యవస్థ, పోలీస్ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. కేసులను సకాలంలో పరిష్కరించేందుకు పోలీస్ శాఖ తరపున నిరంతరం సమన్వయంతో చ ర్యలు కొనసాగుతాయని సీపీ గౌష్ ఆలం తెలిపారు.

# కరీంనగర్ అర్బన్ బ్యాంక్ మహాజన సభ వాయిదా

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్:** కరీంనగర్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ 43వ మహాజన సభ (సర్వసభ్య సమావేశం) ఆదివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో సభ్యులు హాజరు కాకపోవడంతో సమావేశాన్ని నిర్వహించలేకపోయారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం కూడా సభ్యుల హాజరుపై ప్రభావం చూపినట్లు అర్బన్ బ్యాంక్ సీఈవో శ్రీనివాస్ తెలిపారు. డా.బి.ఆర్.అంబేద్కర్ స్టేడియంలో బ్యాంక్ పిఐసీ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి ఆధ్వర్యంలో మహాజన సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే సుమారు 300 మంది సభ్యులు మాత్రమే హాజరయ్యారు. బ్యాంక్ నిబంధనల ప్రకారం సుమారు 1800 మంది సభ్యులు హాజరైనప్పుడే సభను నిర్వహించేందుకు అవసరమైన కోరం పూర్తవుతుంది. దీంతో కోరం లేకపోవడంతో సభను వాయిదా వేయాల్సి వచ్చింది. సమావేశానికి హాజరై తమ విలువైన సమయాన్ని కేటాయించిన గౌరవ సభ్యులందరికీ బ్యాంక్ యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది. సభ్యులు ఎవరూ అన్యధా భావించవద్దని కోరం పూర్తికాకపోవడం వల్లే సమావేశాన్ని నిర్వహించలేకపోయామని పేర్కొంది. త్వరలోనే మరో తేదీని ప్రకటించి మహాజన సభను నిర్వహిస్తామని బ్యాంక్ ప్రతినిధులు తెలిపారు.

# రైస్ మిల్లర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**ప్రజాపక్షం/కరీంనగర్:** రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఇండస్ట్రీపై ఆధారపడ్డ కార్మికులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రైస్ మిల్లర్లు నిర్వహిస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రైస్ మిల్ ఇండస్ట్రీపై వేలాది మంది కార్మికులు ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నారని వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎఫ్సీఐ గోదాముల్లో తగినంత నిల్వ స్థలం కల్పించి, రా రైస్, సీఎంఆర్ ను సకాలంలో లిఫ్టింగ్ చేయాలని డిమాండ్ చేశారు.ధాన్యం కేటాయింపుల్లో ఎలాంటి వివక్ష లేకుండా చూడాలన్నారు. మిల్లింగ్ సామర్థ్యం నిలువ సామర్థ్యం ఆధారంగా కేటాయింపులు ఉండాలన్నారు. గడువులోగా క్రమం తప్పకుండా 100 శాతం బియ్యాన్ని అందించే మిల్లర్లపై ప్రభుత్వం ఎలాంటి ఒత్తిడి లేకుండా, కేసులు పెట్టకుండా చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వానికి సీఎంఆర్ బియ్యం ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడిన వారు ఎవరైనా ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, పౌర సరఫరాల శాఖ మంత్రి, అధికారులు వెంటనే రైస్ మిల్లర్లతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. మిల్లర్లు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు.

# మట్టి వినాయకుల పంపిణీ



**ప్రజాపక్షం/ కొత్తపల్లి :** అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ట్ 137ఏ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం కూడా సుమాలు 70 మందికి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీరు, నేల తోపాటు పర్యావరణానికి కాలుష్యం ఏర్పడుతుందని వివరించారు. పర్యావరణహితమైన మట్టి వినాయకులను ఉపయోగించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని పూజా అనంతరం మట్టి తిరిగి మట్టిలో కలిసిపోయే విధంగా ఉండడం మట్టి వినాయకుల ప్రత్యేకత అని తెలిపారు.మట్టి వినాయకుల పంపిణీ కూడా పర్యావరణహిత పండుగల నిర్వహణకు ప్రజల్లో అవగాహన కల్పించే మరో ముఖ్యమైన కార్యక్రమమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా.చక్రవర్తుల రమణాచారి, డా.జి.ఎం.కిరణ్, డా.పురుషోత్తం, డా.అశోక్, డా.శ్రీనివాస్, డా.సౌమ్య, డా.సాయి మేఘన డా.సాయి ప్రీతం తదితరులకు మట్టి వినాయక విగ్రహాలను అందజేసి పర్యావరణ పరిరక్షణలో వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో డా.ఏ.శ్రీనివాస్, కోల అన్నారెడ్డి, జిల్లా గవర్నర్ కొంజర్ల మహేశ్, టి.వి.రావు, బండిపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

# మెడికవర్‌లో అత్యంత అరుదైన గుండె చికిత్స




**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** గుండెకు రక్తాన్ని సరఫరా చేసే అత్యంత కీలకమైన రక్తనాళంలో ఏర్పడిన తీవ్రమైన బ్లాకేజీకి కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా చికిత్స నిర్వహించారు. అత్యంత క్లిష్టమైన లెఫ్ట్ మెయిన్ కరోనరీ ఆర్టరీ బ్లాకేజీ కేసును సవాల్‌గా తీసుకొని కార్డియాలజిస్ట్ డా.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో విజయవంతంగా స్టంట్ అమర్చి పేషంట్‌కు ప్రాణాపాయ పరిస్థితి నుంచి కాపాడారు. ఆదివారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డా.సతీష్ కుమార్ మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన క్రిష్టోఫర్ స్టాన్లీ బంటు అనే వ్యక్తి తీవ్రమైన గుండె నొప్పితో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రికి వచ్చారని తెలిపారు. వెంటనే పేషంట్ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన గుండె పరీక్షలు నిర్వహించామని చెప్పారు. పరీక్షల్లో గుండెకు రక్తాన్ని సరఫరా చేసే అత్యంత ముఖ్యమైన రక్తనాళామైన లెఫ్ట్ మెయిన్ కరోనరీ ఆర్టరీలో తీవ్రమైన బ్లాకేజీ ఉన్నట్లు గుర్తించామని వివరించారు. ఈ రక్తనాళంలో బ్లాకేజీ ఏర్పడితే గుండె కండరాలకు రక్త సరఫరా తగ్గిపోయి తీవ్రమైన గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంటుందని తెలిపారు. పేషంట్ పరిస్థితిని పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం అత్యాధునిక కార్డియాక్ చికిత్సా విధానాన్ని ఉపయోగించి బ్లాకేజీ ఉన్న ప్రాంతంలో విజయవంతంగా స్టెంట్ అమర్చామని పేర్కొన్నారు. లెఫ్ట్ మెయిన్ వంటి కీలకమైన రక్తనాళంలో స్టెంట్ వేయడం అత్యంత క్లిష్టమైన ప్రక్రియ అయినప్పటికీ సవాల్‌గా స్వీకరించి విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితిని నిలకడగా ఉండడంతో కేవలం 24 గంటల్లోనే పేషంట్‌ను డిశ్చార్జ్ చేశామని వెల్లడించారు. గుండె సంబంధిత అత్యంత క్లిష్టమైన కేసులకు చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పేషంట్ క్రిష్టోఫర్ మాట్లాడుతూ కరీంనగర్‌లోనే జన్మించానని ఇక్కడే నాకు మెడికవర్ వైద్యులు పునర్జన్మ ఇచ్చారని సంతోషం వ్యక్తం చేస్తూ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ విలేకరుల సమావేశంలో అనెస్థిషియా హెడ్ డా.వినయ్, క్రిటికల్ కేర్ హెడ్ డా.ఉపేందర్ రెడ్డి, మార్కెటింగ్ హెడ్ కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/చొప్పదండి :** చొప్పదండి రెడ్డి యువజన సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొత్త గంగారెడ్డి, ఉపాధ్యక్షుడిగా గుర్రం రామకృష్ణారెడ్డి, కార్యదర్శిగా గుర్రం చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సోమ శ్యామ్ సుందర్ రెడ్డి, కన్వీనర్ గా గుర్రం దీప్తిధర్ రెడ్డి, కమిటీ సభ్యులుగా గుర్రం రవి తేజ రెడ్డి, బద్దం శశిధర్, గుర్రం సమరసింహారెడ్డి, కళ్లెం మురళీకృష్ణ రెడ్డి, కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, నోముల కౌశిక్ రెడ్డి, లోక వంశీధర్ రెడ్డి, సురుకొంటి చంద్రశేఖర్ రెడ్డిలు ఎన్నికయ్యారు. అనంతరం కౌన్సిలర్లు గుర్రం సుజిత్ రెడ్డి, కొత్త సుమలత గంగారెడ్డి, పిహెచ్.డి గ్రహీత కళ్లెం శ్రీనివాస్ రెడ్డిలను సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కొత్త గంగారెడ్డి మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రెడ్డి యువజన సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# మట్టి గణపతులను పంపిణీ చేసిన సర్పంచ్




**ప్రజాపక్షం/గన్నేరువరం:** గన్నేరువరం మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామంలో ఆదివారం గ్రామ సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ ఉప సర్పంచ్‌తో కలిసి గ్రామ పంచాయతీ ఆవరణలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అందుకోసం రసాయన వినాయక విగ్రహాలను కాకుండా మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. రసాయనాలు వాడిన విగ్రహాలను వాడడం వల్ల పర్యావరణానికి హాని కలిగించినవారమవుతామని పేర్కొన్నారు. కావున ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు చిన్నారులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేట మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** ఎల్లారెడ్డిపేట మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక సాయి మణికంఠ ఫంక్షన్ హాల్‌లో సీనియర్ పాత్రికేయుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నిమ్మ బాల్ రెడ్డి (సాక్షి), ఉపాధ్యక్షులుగా శామంతుల అనిల్ (వి6 వెలుగు), సయ్యద్ షరీఫ్ (సూర్య), ప్రధాన కార్యదర్శిగా బుర్క బాబ్జి(నమస్తే తెలంగాణ), సంయుక్త కార్యదర్శులుగా కట్టెల బాబు(ప్రజా దర్బార్), గుర్రాల చంద్రమోహన్ రెడ్డి (ఆంధ్రప్రభ), కందుకూరి రవి(ఎస్‌ఎస్ కేబుల్), కోశాధికారిగా మహమ్మద్ లతీఫ్( జనంసాక్షి), గౌరవ అధ్యక్షులుగా దుంపేటి గౌరీ శంకర్(ఆంధ్ర జ్యోతి), మిట్టపల్లి లక్ష్మీ నారాయణ(వార్త), గౌరవ సలహాదారులుగా ఎదురుగట్ల ముత్తయ్య(మన తెలంగాణ), కొండ్లెపు జగదీశ్వర్(ప్రజా పక్షం), గౌరవ సభ్యులుగా ఇల్లందుల రాజిరెడ్డి(ఈనాడు), మజీద్(నవతెలంగాణ), పందిర్ల రవికాంత్ గౌడ్(మెట్రో), బత్తిని శ్రీధర్ గౌడ్(విజన్ఆంధ్ర) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా ప్రయత్నం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు సహరించాలని కోరారు.

# ఎన్నారై దంపతుల ఔదార్యం

ప్రజాపక్షం/ధర్మపురి : ఆర్థిక ఇబ్బందులతో పూరిగుడిసెలో నివసిస్తున్న కమలాపూర్‌కు చెందిన నిరుపేద మహిళ లింగంపల్లి లక్ష్మి కుటుంబానికి అమెరికాలో స్థిరపడిన జగిత్యాల ప్రాంతానికి చెందిన సత్యసాయి అభయహస్తం సభ్యులు శివకుమార్–శ్రీదేవి దంపతులు అండగా నిలిచారు. రూ.2.98 లక్షల ఆర్థిక సహాయంతో మూడు గదుల నూతన గృహాన్ని నిర్మించి ఆదివారం గృహప్రవేశం నిర్వహించారు.ధర్మపురి మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి భర్త రెండేళ్ల క్రితం మృతి చెందడంతో ఇద్దరు పిల్లలతో కలిసి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది.ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటంతో పూరిగుడిసెలో జీవనం సాగిస్తున్న విషయం తెలుసుకున్న ఎన్నారై దంపతులు ఆమె కుటుంబానికి సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించారు.ఈ మేరకు రెండు నెలల క్రితం ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణుకుంట రమేష్‌ను ఫోన్‌లో సంప్రదించి, తమ తరఫున నిరుపేద కుటుంబానికి ఇల్లు నిర్మించాలని కోరారు.వారు అందించిన రూ.2.98 లక్షల విరాళంతో రమేష్ మూడు గదుల నూతన గృహాన్ని నిర్మించారు.దీంతో ఇంతకాలం పూరిగుడిసెలో జీవించిన లక్ష్మి కుటుంబానికి సొంత గూడు లభించింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుమ్మరి తిరుపతి,సత్యసాయి అభయహస్తం సభ్యులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## చట్ట సభల్లో యాదవులకు, బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలి



ప్రజాపక్షం/రాయికల్: చట్ట సభల్లో యాదవులకు, బిసిలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని యాదవ హక్కుల పోరాట సమితి జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు బల్లం మల్లేష్ యాదవ్ డిమాండ్ చేసారు. ఆదివారం రాయికల్ మండల కేంద్రంలో పట్టణ యాదవ సంఘం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాజ్యాంగ సవరణ ద్వారా యస్.సి, యస్టీ లకు చట్ట సభల్లో రిజర్వేషన్ లు కల్పించినట్లుగానే యాదవులకు, బిసిలకు రిజర్వేషన్ లు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసారు. రాజ్యాధికారం ద్వారానే బిసిల, యాదవుల సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్ యాదవ్ మహేష్ యాదవ్, హర్షిత్ యాదవ్, పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం



ప్రజాపక్షం/ధర్మపురి : తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహాయ సహకారాలతో ధర్మపురి పట్టణంలోని 1వ వార్డులో శ్రీ పోచమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనులకు ఆదివారం శ్రీకారం చుట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అయ్యోరి వేణుగోపాల్, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందారపు రామన్నతో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక సేవలకు మరింత ప్రోత్సాహం

ప్రజాపక్షం/రాయికల్ : భక్తుల ఆధ్యాత్మిక సేవలకు మరింత ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో రాయికల్ పట్టణ హనుమాన్ ఆలయ చైర్మన్ దాసరి గంగాధర్ తన సొంత నిధులతో ఆలయానికి భజన సామాగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు తన సహకారం ఎల్లప్పుడూ అందిస్తానన్నారు. భజన కార్యక్రమాల ద్వారా భక్తుల్లో ఆధ్యాత్మిక భావన, భక్తి, ఐక్యత మరింత పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భరత్ శర్మ, గంగాధర్, శంకర్, పాల్గొన్నారు.

## బతుకమ్మ సందడికి భూమి చదును




ప్రజాపక్షం/గొల్లపల్లి : తెలంగాణ సంస్కృతి ,సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను,మహిళలు రోడ్డుపైన ఆడుకుంటూ ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు.జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన మహిళలందరూ ఇబ్బందులు పడకుండా ఎంతో భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా దసరా నవరాత్రులలో తొమ్మిది రోజుల పాటు మహిళలు,యువతులు,చిన్నపిల్లలు అందరు కలిసి బతుకమ్మలు ఆడి,పాటలు పాడి గ్రామంలోని మహిళలందరూ ఒకే చోట చేరి సురక్షితంగా ప్రశాంతంగా పండుగను జరుపుకోవడానికి చెరువు కట్ట దగ్గర ఉన్న పెద్ద బిల్కు గుట్ట అనువైన స్థలం అని గమనించిన గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలతో ఈ విషయాన్ని చర్చించి మహిళలు ఇబ్బంది పడకుండా మహిళల కోసం ఊరు బాగుకోసం చెరువు కట్ట వద్ద ఉన్న పెద్ద బిల్కుగుట్ట సమీపంలో ఆదివారం భూమి చదును చేయడానికి సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి పాలకవర్గ సభ్యులతో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి,ఉప సర్పంచ్ గురిజాల బుచ్చిరెడ్డి,వార్డు సభ్యులు,మహిళలు ,కుల సంఘాల సభ్యులు,గ్రామ పెద్దలు,గ్రామ ప్రజలు,యువకులు,తదితరులు పాల్గొన్నారు.

## దోచుకోవడం, దాచుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



ప్రజాపక్షం/రాయికల్: దోచుకోవడం,దోచుకున్నది దాచుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క ముఖ్య లక్ష్యం అనిజగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు.ఆదివారం రాయికల్ పట్టణంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు పూర్తికావస్తుందని అమలు కాని అనాలోచిత హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేశారని అన్నారు.కెసిఆర్ నాయకత్వంలో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు చేకూర్చాల్సిన లబ్ది కోసం ప్రజల గొంతుకై ప్రశ్నించడం జరిగిందని అన్నారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి 22 ఏ నిషేధిత జాబితాలో పట్టాదారు రైతులను కూడా చేర్చారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని అన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి రైతుల భూమి మీద కన్ను పడిందని దీనికి వెనుక నుండి రేవంత్ రెడ్డి ప్రోత్సహిస్తున్నాడని అన్నారు.పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇద్దరు కలిసి 22ఏ కొత్త భూదందాకు తెర లేపారు అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ మరియు మండల అధ్యక్షుడు అనిల్ కుమార్ బర్కం మల్లేష్,కో ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి,గంగారెడ్డి,సత్యం గౌడ్,పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతుల ప్రతిష్ట



ప్రజాపక్షం/రాయికల్: గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు పర్యావరణ పరిరక్షణ హితం కావాలని ఆకాంక్షిస్తూ రామాజీపేట గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఐలేని కృష్ణారెడ్డి మట్టి గణపతులను గ్రామంలో వితరణ చేశారు.వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రస్తుత కాలంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ఎక్కువగా ఉపయోగించడం వల్ల చెరువులు,కుంటలు కలుషితమవుతున్నాయని దీనితో పరిసరాలు,పంట పొలాలు కలుషితమై ప్రజలకు అనారోగ్యాలను గురి చేస్తున్నాయని, దీనిని అరికట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పర్యావరణ పరిరక్షణ చేపట్టాలని ఉద్దేశ్యంతో తాను ఈ కార్యక్రమం చేపట్టినట్లు కృష్ణారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమం లో గ్రామ ఉప సర్పంచ్ ఇద్దం సుధీర్ రెడ్డి,మాజీ సర్పంచ్ వాసరి రవి, ఆలయ కమిటీ చైర్మన్ కోల రాజు,వార్డు సభ్యులు విష్ణు, తిరుపతి రెడ్డి,నాయకులు బీమారెడ్డి, ఐలేని రాజు, ఏనుగంటి రాజు, సుకిత్, మల్లారెడ్డి, రాజేందర్,మహేందర్, బాలల సంక్షేమ సంఘం సభ్యులు మేదాంశ్ రెడ్డి, హిమాన్స్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ జెడ్పి చైర్మన్ వసంత పరామర్శ



ప్రజాపక్షం/మల్లాపూర్ : బిఆర్ఎస్ నాయకులు రేగుంట ఉపసర్పంచ్ నందిని మల్లేష్ యాదవ్ తండ్రి ఇటీవల గుండెపోటుతో హఠాన్మరణం చెందగా జగిత్యాల మాజీ జెడ్పీ చైర్మన్ దావ వసంత ఆదివారం పరామర్శించారు.ఏ మేరకు మల్లేష్ యాదవ్ ను స్వగృహంలో పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వీరి వెంట జిల్లా మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకులనే పూజిద్దాం




ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: రసాయనిక రంగులతో కాకుండా మట్టితో తయారు చేసిన వినాయకులనే పూజించుకుందామని ఎల్లారెడ్డిపేట లయన్స్ క్లబ్ అధ్యక్షులు బోయిన మహదేవ్ తెలిపారు.ఆదివారం గొల్లపల్లి బస్టాండ్ లో గీతామందిరం,సాయి బాబా మందిరం వద్ద 216 మట్టితో తయారుచేసిన విగ్రహాలు,ఎల్లారెడ్డిపేట లో పాత,కొత్త బస్టాండ్ చోట 216 మొత్తంగా నాలుగువందల ముప్పై రెండు మట్టి వినాయకులను పంపిణీ చేశారు.విగ్రహాల దాత ముత్యాల దేవేందర్‌రెడ్డి,కార్యదర్శి గుర్రాల రాజిరెడ్డి,కోశాధికారి వంగశ్రీకాంత్‌రెడ్డి,వయ్యపుల రాంచంద్రం,నందికిషన్‌రవీందర్‌రెడ్డి,నద్ది లక్ష్మారెడ్డి,శంకర్,రావుల లింగారెడ్డి,ముత్యం,గుల్లపల్లి లక్ష్మారెడ్డి తదితరుల చేతుల మీదుగా పంపిణీ చేశారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు భర్తీపూర్ గ్రామస్తుల ముందడుగు

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం భర్తీ పూర్ గ్రామపంచాయతీ పాలకవర్గం, రైతులు, గ్రామ ప్రజలు ఆదివారం సమావేశమై కీలక తీర్మానం చేసుకున్నారు. ఈ సందర్భంగా సమావేశంలో రోడ్డు ప్రమాదాల నివారణకు సర్పంచ్ సంగం అమృత ఆధ్వర్యంలో సమావేశమై, ఆర్ అండ్ బి రోడ్డు, సీసీ రోడ్లపై వరి,మొక్కజొన్న, సోయాబీన్ పంటలను ఆరబెట్టరాదని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఉపాధి హామీ పథకంలో నాటిన మొక్కలను కాల్చకుండా సంరక్షించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధించాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంగం సాగర్,వార్డు సభ్యులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుల పంపిణీ

ప్రజాపక్షం/మెట్‌పల్లి : చైతన్యనగర్ ఆర్యవైశ్య వాడకట్టు సంఘం నంబర్–1 ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.వినాయక చవితి పూజకు అవసరమైన పూజా సామగ్రిని కూడా భక్తులకు అందజేశారు. పొట్లకాయ, సీతాఫలం, ఒసగాయ,ఎలిక్కాయ తదితర పూజా సామగ్రిని పొట్లాల రూపంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని నిర్వాహకులు సూచించారు.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పుల్లూరి నవీన్‌కుమార్, కోశాధికారి నరేంద్రుల రవికుమార్,మహిళా సంఘం అధ్యక్షురాలు పుల్లూరి మధుమిత, పుల్లూరి రాములు, కంభంపాటి శంకర్, లక్ష్మణ్, పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్, ఆయాల జీతాలు చెల్లించాలి




ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ప్రీ ప్రైమరీ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల జీతాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రీ ప్రైమరీ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్, ఆయాల యూనియన్ రాష్ట్ర న్యాయ సలహాదారు జక్కనపల్లి గణేశ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంఛార్జి ఎం.లక్ష్మణ్‌లు డిమాండ్ చేశారు. పట్టణంలోని స్నేహ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో జరిగిన యూనియన్ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రీ ప్రైమరీ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్, ఆయాలకు పని సమయాన్ని తగ్గించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. వర్కర్లకు ఎంప్లాయ్ స్టేట్ ఇన్సూరెన్స్, ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రస్తుత వేతనాలు తక్కువగా ఉన్నాయని కనీస వేతన చట్టం ప్రకారం జీతాలను సవరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అడహక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా సుమయా సధాఫ్, కో కన్వీనర్‌లుగా గుండ మమత, ఇటికాల ధనూజ, జవ్వాజి శ్రావ్య,ఎన్నికయ్యారు.

## మాజీ నక్సలైట్ కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మచ్చుపేట గ్రామానికి చెందిన మాజీ నక్సలైట్ బంధారపు చంద్రన్న (మల్లన్న) రాజన్నల తల్లి లక్ష్మి ఇటీవల మృతి చెందగా, ఈ విషయం తెలుసుకున్న మాజీ జెడ్పిటిసి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగినేని జగన్ మోహన్ రావు ఆదివారం వారి నివాసానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలు లక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శోకసప్త కుటుంబ సభ్యులను ఓదార్చి, తన గాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక నాయకులు తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## విధేయతకు దక్కిన గౌరవానికి స్నేహితుల సన్మానం



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** (ఎలిగేడు ) ఎమ్మెల్యే విజయరమణారావుకు విధేయుడుగా ఉంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్యాల రమేష్ ను తన స్నేహితులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు సిఫారసుతో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటుచేసిన ఎలిగేట్ మార్కెట్ కమిటీకి నూతన చైర్మన్ గా ఎన్నికైన పొట్యాల రమేష్ ను తనతో పాటు విద్యనభ్యసించిన టెన్త్ క్లాస్ మెంట్స్ ఆదివారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మామిడాల కిరణ్, మహేందర్ రెడ్డి,సతీష్,శ్రీనివాస్, రాము చారి, శేఖర్,మోహన్, శ్రవణ్, కప్పల సతీష్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మచ్చుపేట గ్రామంలో ఇటీవల మరణించిన అలిశెట్టి బుచ్చవ్వ ద్వాదశ దినకర్మ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడు దుండే మల్లేష్ ముఖ్య అతిథిగా హాజరై, బుచ్చవ్వ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుచ్చవ్వ మరణం వారి కుటుంబానికి తీరని లోటని,వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి,వారికి తమ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు,సంఘం సభ్యులు,కుటుంబ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు

### పేద కార్మికులను నమ్మించి రూ.10 కోట్లు మోసగించారు



**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్:** తనపై కొందరు వ్యక్తిగత ద్వేషంతో కావాలని అసత్య ప్రచారం చేస్తున్నారని,ఆధారాలు లేని ఆరోపణలు గుప్పిస్తే చట్టపరంగా కోర్టు నోటీసులు పంపిస్తామని మహనీయుల ఆశయ సాధన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి కైలాసం తీవ్రంగా హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ అధ్యక్షుడు బొంకురి కైలాసం మాట్లాడుతూ ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు మామిడిపల్లి బాపయ్య,లంక సదయ్య,బొంకూరి మధు వ్యవహార శైలి,వారి ఏకపక్ష తీరు సరిగా లేకపోవడం వల్లే తాను ఆ సంఘం నుండి బయటకు రావాల్సి వచ్చిందన్నారు.ప్రజాస్వామ్యబద్ధంగా,నిజాయితీగా పని చేసేందుకు జిల్లా స్థాయిలో మహనీయుల ఆశయ సాధన సంఘాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నట్లు స్పష్టం చేశారు. తాను సెప్టెంబర్ 4న పెద్దపల్లి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం గురించిన వ్యాఖ్యల్లో ఏమైనా పొరపాట్లు దొర్లి ఉంటే వాటిని ఉపసంహరించుకుంటున్నానని, ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే క్షమించాలని ఈ సందర్భంగా కోరారు. గుండారం ప్రాంతంలో ఉద్యోగాల పేరిట తాను స్కామ్ చేశాననడం పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. సుల్తానాబాద్‌కు చెందిన చిలక రాజేశం అనే వ్యక్తి బాధితుల వద్ద డబ్బులు వసూలు చేయగా,తలెత్తిన వివాదంలో కమాన్ పూర్ ఎస్.ఐ సూచన మేరకు తాను మధ్యవర్తిగా ఉండి బాధితులకు న్యాయం చేసేందుకు తన సొంత డబ్బులు 90వేలు చెల్లించినట్లు వివరించారు.తనపై ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు భౌతిక దాడులకు ప్రయత్నిస్తున్నారని,తనకు ఎలాంటి ప్రాణహాని లేదా నష్టం వాటిల్లినా దానికి పూర్తి బాధ్యత మామిడిపల్లి బాపయ్య,బొంకూరి మధు, లంక సదయ్య లదేనని బొంకూరి కైలాసం సంచలన వ్యాఖ్యలు చేశారు.

## రైస్ మిల్లు యజమానులతో ప్రభుత్వం చర్చలు జరపాలి

### సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** గత 4 రోజులుగా తమ సమస్యలుపరిష్కరించాలని సమ్మె చేస్తున్న రైస్ మిల్లు యజమానులకు మద్దతుగా ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో సుల్తానాబాద్ రైస్ మిల్స్ ప్రాతం వద్ద నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావుమాట్లాడుతూ రైస్ మిల్లు ఓనర్స్ అసోసియేషన్ నాయకత్వంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి,సమ్మెను నివారించి,పరిశ్రమను నడిపించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, తెలంగాణ రాష్ట్రంలో 2 లక్షల మంది,పెద్దపల్లి జిల్లాలో 8వేల మంది కుటుంబాలు రైస్ మిల్లు పరిశ్రమపై ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారని అన్నారు. గుమస్తాలు, ఆపరేటర్స్,మహిళా కూలీలు, లారీ డ్రైవర్స్,హమాలీలు తదితర కేటగిరీలుగా పనిచేస్తున్నారని అన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైస్ మిల్లు యజమానులకు రావలసిన తొమ్మిది వేల కోట్ల రూపాయలు పెండింగ్ పెట్టారని, ఇంకా అనేక సమస్యలు రైస్ మిల్లు పరిశ్రమను వెంటాడుతున్నాయని, వీటన్నింటికీ పరిష్కారం చూపించవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని అన్నారు. అందుకే రైస్ మిల్లు యజమానులతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి, సమ్మెను నివారించి, పరిశ్రమను నడిపించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తాండ్ర అంజయ్య, సిఐటియు మండల కో కన్వీనర్ మాతంగి రాజమల్లు,రైస్ మిల్లు ఆపరేటర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నౌవుండ్ల బ్రహ్మచారి,బండారి స్వామి, బచ్చన్ దేవ్, స్వామి, లింగయ్య, సది, మహేష్, శీను, మహేందర్, విలాస్, శంకరయ్య, రమేష్, ఓదెలు, కుమార్, సంపత్, ప్రభాకర్, ఎల్లయ్య, రవీందర్, రాజు, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/రామగిరి:** సెప్టెంబర్ 17, 1948 తెలంగాణ విమోచన చరిత్రలో అత్యంత కీలకమైన రోజు. బిజెపి ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాజీ మొలుమూరి శ్రీనివాస్ మాట్లాడుతూ నిరంకుశ పాలనకు ముగింపు పలికి హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనం అయింది. తెలంగాణ ప్రభుత్వ స్కూల్ పాఠ్యపుస్తకాల్లో కూడా సెప్టెంబర్ 17, 1948న హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనమైనట్లు స్పష్టంగా ఉంది తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవం"గా కాకుండా ప్రజా పాలన దినోత్సవం"గా నిర్వహిస్తోంది. ప్రభుత్వం 2024లో ఇదే విషయాన్ని అధికారికంగా ప్రకటించిం ది; 2025 లో కూడా అదే పేరుతో కార్యక్రమాలు నిర్వహించింది. తెలంగాణబీజేపీ తరఫున డిమాండ్ చేస్తూసెప్టెంబర్ 17ను "తెలంగాణ విమోచన దినోత్సవం"గా అధికారికంగా గుర్తించాలి.రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించాలి.నిజాం వ్యతిరేక పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం విమోచన పోరాట చరిత్రను పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు మరింత స్పష్టంగా బోధించాలి.తెలంగాణ విమోచన పోరాటానికి సంబంధించిన చారిత్రక ప్రదేశాలను అభివృద్ధి చేసి స్మారక కేంద్రాలు ఏర్పాటు చేయాలి.బదులుగా "ప్రజా పాలన దినోత్సవం పేరుతో కాకుండా తెలంగాణ విమోచన దినోత్సవం పేరుతో నిర్వహించాలబీజేపీ ఉద్యమ నినాదం:సెప్టెంబర్ 17 – తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా ప్రకటించాలి అమర వీరుల త్యాగాలకు గౌరవం ఇవ్వాలి అని డిమాండ్ చేశాడు.

## మట్టి గణపతుల పంపిణీ



**ప్రజాపక్షం/ధర్మపురి :** వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బీజేపీ రాష్ట్ర నాయకులు దామెర రామ్ సుధాకర్ రావు ఆధ్వర్యంలో ఆదివారం ధర్మపురి పట్టణంలో ఉచిత మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.స్థానిక నందీచౌక్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ధర్మపురి సీఐ రామ్ నరసింహారెడ్డి, ఎస్ఐ సదాకర్ ముఖ్య అతిథులుగా హాజరై భక్తులకు మట్టి గణపతులను పంపిణీ చేశారు."మట్టి గణపతి–పర్యావరణానికి మేలు" అనే సందేశంతో ప్రజలకు ఉచితంగా మట్టి విగ్రహాలను అందిస్తున్నామని తెలిపారు. . కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్,జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, బోగ రవికుమార్, కస్తూరి రాజన్న,బండారి లక్ష్మ ణ్, పల్లర్ల సురేందర్,తిరుమందాస్ సత్యనారాయణ,సంగి మాధవ్, కలకోట రాజు,మండలోజు సూరజ్,సుంకు మధుసూదన్, ఠాగూర్ రాకేష్, మరియాల అనూష,రాపర్తి ప్రభాకర్, దివిటి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఎఐపిసి బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తా

### ఎఐపిసి జిల్లా అధ్యక్షుడు కమ్మగోని చౌదరి గౌడ్



**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:** ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కమ్మగోని చౌదరి గౌడ్,హైదరాబాద్‌లో ఏఐపిసి జాతీయ చైర్మన్ మధు యాష్కీ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీ సందర్భంగా పెద్దపల్లి జిల్లాలో సంస్థాగత పురోగతి, భవిష్యత్ కార్యక్రమాలపై వీరిద్దరూ సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా కమ్మగోని చౌదరి గౌడ్ మాట్లాడారు.మధు యాష్కీ గౌడ్ దిశా నిర్దేశంలో ఎఐపిసి దేశవ్యాప్తంగా ప్రజల్లో,వృత్తి నిపుణుల్లో మరింత విశ్వసనీయతను పొం దుతూ, సంస్థాగతంగా కొత్త శిఖరాలను అధిరోహిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## నేటి నుండి గ్రామగ్రామాన కొలువు దీరనున్న గణనాథులు!



**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల వ్యాప్తం గా వినాయక చవితి నవ రాత్రి ఉత్సవాలు నేటి నుండి ప్రారంభం కానున్నాయి. ముత్తారం మండలంలోని గ్రామగ్రామాన గణనాథులు సోమవారం నుండి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో భారీ విగ్రహాలను ఆదివారం సాయంత్రం ముత్తారం మండలానికి తరలించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి లంబోదరుడికి ఘన స్వాగతం పలికారు.మహిళలు మంగళ హారతులు పట్టగా, యువకుల ఆటపాటలు, డప్పు వాయిద్యాల మధ్య గణేశ్ విగ్రహాలను మండపాల వద్దకు చేర్చారు.నేటి నుండి తొమ్మిది రోజుల పాటు గ్రామాల్లో ఈ నవరాత్రి ఉత్సవాలు కన్నులపండువగా సాగనున్నాయి.

## ఎమ్మెల్యే సహకారంతో గ్రామాల అభివృద్ధి!



**ప్రజాపక్షం/అంతర్గాం:** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల సర్పంచుల ఫోరం నూతన అధ్యక్షుడిగా మద్దిర్యాల సర్పంచి ముక్కెర రాజమౌళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా గాదె స్రవంతి సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా గుంట బాపులను కూడ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఫోరం నూతన అధ్యక్షుడు ముక్కెర రాజమౌళి మాట్లాడుతూ, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సహకారంతో అంతర్గాం మండలంలోని గ్రామాలు, ప్రజల సమస్యల పరిష్కారంతోపాటు పంచాయతీల పాలకవర్గాల బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం మండల కమిటీ నూతన కార్యవర్గానికి పలువురు సర్పంచులు అభినందనలు తెలిపారు.

## మట్టి గణపతిని పూజించండి పర్యావరణాన్ని రక్షించండి



### మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాజా కృష్ణ

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** మట్టితో చేసిన వినాయక ప్రతిమలకు పూజలు అందించి పర్యావరణాన్ని పరిరక్షించాలని సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ అన్నారు.ఆదివారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మట్టితో చేసిన వినాయక ప్రతిమలను మున్సిపల్ వైస్ చైర్మన్ కౌన్సిలర్లతో కలిసి భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అంతటి పుష్పలత, కౌన్సిలర్లు గాజుల రాజమల్లు,ఈర్ల స్వరూప శేఖర్, కందునూరి సమత కుమార్,అమీర్శెట్టి శ్రావణి రాకేష్, గాదాసు మంజుల రవీందర్,గరిగె శోభ శ్రీనివాస్,తొర్రికొండ ప్రభాకర్,మున్సిపల్ సిబ్బంది,భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులైనా కళాకారుల కల నెరవేరలేదు

### మెనిఫెస్టోలో పెట్టిన జిఓను అమలు చేసి కళాకారులకు ఉద్యోగాలివ్వాలి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** తెలంగాణ ఉద్యమంలో ఊరూర తిరిగి ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన అర్హులైన కళాకారులకు సారథిలో ఉద్యోగాలు ఇవ్వాలని నిరుద్యోగ కళాకారుల జిల్లా అధ్యక్షులు చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి మహేందర్, కోశాధికారి రమేష్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం అని చెప్పి వెయ్యి రోజులు పూర్తయిన కళాకారులకు ఉద్యోగాల కల నెరవేరలేదన్నారు. శాసనసభలో కళాకారుల పై కపట ప్రేమను చూపుతూ మాట్లాడిన సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఉద్యోగాలు ఎందుకు ఇవ్వటం లేదన్నారు. సాంస్కృతిక సారథిలో ఉద్యోగాల కోసం మెనిఫెస్టోల పెట్టిన జిఓను వెంటనే అమలుపర్చాలని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. వెంటనే నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగాలు ఇచ్చే దిశగా కార్యాచరణ రూపొందించాలని, లేని పక్షంలో 33 జిల్లాల కళాకారులతో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామన్నారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా అర్హులైన కళాకారులు అందరికి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కళాకారుల జీవితాలు ఎంతో దుర్భరంగా మారాయన్నారు. ఆనాడు ఉద్యమం కోసం చేస్తున్న ఉద్యోగాలు పనులు వదిలేసి ఉద్యమించామని, ఈనాడు ఉపాధి లేక ఇల్లు గడవని పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నామన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు కాంగ్రెస్ నాయకులు అర్హులైన కళాకారులకు తెలంగాణ సాంస్కృతిక సారథిలో వెయ్యి ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని కోరారు. నిన్న జరిగిన శాసనసభలో సాంస్కృతిక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కళాకారులను ఆదుకుంటామని కాలయాపన మాటలు మాట్లాడారు తప్ప కళాకారుల బతుకులలో వెలుగులు నింపాలని ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదని తెలుస్తుందన్నారు. ప్రభుత్వం కళాకారులను ఆదుకోకుంటే తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కళాకారులను కలుపుకుని రాష్ట్రస్థాయిలో నిరసన కార్యక్రమం చేపడుతామన్నారు.



# ఘనంగా ‘గురు రత్న అవార్డు–2026’ వేడుకలు

### మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన కార్యక్రమం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని పెన్షనర్ భవన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఫ్రెండ్స్ హెల్పింగ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన “గురు రత్న అవార్డు –2026” ప్రధానోత్సవ కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా, పండగ వాతావరణంలో జరిగింది.విద్యారంగంలో విశేష సేవలు అం దిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను,సమాజ పురోగతికి అనునిత్యం వార్తలను అందిస్తున్న జర్నలిస్టులను ఒకే వేదికపై గౌరవించుకోవడం విశేషంగా నిలిచింది.ఈ వేడుకలకు ఫ్రెండ్స్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షులు షేక్ అన్సర్ పాషా అధ్యక్షత వహించగా, సొసైటీ గౌరవ అధ్యక్షులు కృష్ణం రాజు ముఖ్య సమన్వయకర్తగా వ్యవహరించారు. వివి ధ వర్గాలు, మతాల ప్రతినిధులు ఒకే ప్రాంగణం లో కలిసి పాల్గొనడంతో ఈ కార్యక్రమం మత సామరస్యానికి, భిన్నత్వంలో ఏకత్వానికి నిలువెత్తు రూపంగా భాసించింది.ఉపాధ్యాయులు, జర్నలిస్టులకు ఘన సత్కారంసమాజ నిర్మాణంలో అక్షర యోధులైన ఉపాధ్యాయుల సేవల ను గుర్తించి ప్రోత్సహించాలనే గొప్ప సంకల్పం తో సొసైటీ ఈ పురస్కారాలను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా జి ల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో విశిష్ట సేవలు అందిస్తు న్న 100 మందికి పైగా ఉపాధ్యాయులను గుర్తించి, వా రికి “గురు రత్న అవార్డు–202 6”ను ప్రదానం చేశారు. శాలువాలు, జ్ఞాపికలతో వారిని అ త్యంత ఘనంగా సత్కరించారు. విద్యారంగాని కి ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని, వారిని సత్కరించుకోవ డం సమాజ బాధ్యత అని అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో కూడా వి ద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు వారు పడే శ్రమను గుర్తించేందుకే ప్రతి ఏటా ఈ పురస్కారాలను అందజేస్తున్నామని వివరించారు. భవిష్యత్తులో కూడా సొసైటీ తరపున విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.సందడి చేసిన ప్రముఖులుఈ పురస్కార ప్రధానోత్సవంలో జిల్లా లేబర్ ఆఫీసర్ ముత్యం రెడ్డి, టిఎన్‌జిఓ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, ట్రస్మా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, (ప్రజాపక్షం) స్టాఫ్ రిపోర్టర్ వెంక గారి భూమయ్య, (ఆంధ్రజ్యోతి) స్టాఫ్ రిపోర్టర్ రవీందర్ ,(తెలంగాణ వెన్నెల వాక్కు) సీఈఓ డి యోగేష్ కుమార్,ప్రముఖ నాయకులు శ్రీధర్, శిరీష్ రెడ్డి, శ్రవణ్,రఘు తదితరులు పాల్గొని అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు. సమాజ హితం కోసం శ్రమిస్తున్న ఉపాధ్యాయులను, జర్నలిస్టులను ఒకే వేదికపైకి తెచ్చి గౌరవించిన సొసైటీ నిర్వాహకులను జిల్లా వ్యాప్తంగా విచ్చేసిన ఉపాధ్యాయులు,సీనియర్ జర్నలిస్టులు, విద్యావేత్తలు,వివిధ సం ఘాల నాయకులు, సొసైటీ సభ్యులు పాల్గొని విజయవంతం చేశారు.

# జాతీయ సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి

### బిఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** కోల్ ఇండియా తరహాలోనే సింగరేణిలోనూ జెబిసిసిఐ ప్రాతినిధ్యం కలిగిన జాతీయ కార్మిక సంఘాలకు సమాన హోదా, అవకాశాలు కల్పించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ డిమాండ్ చేసింది. శ్రీరాంపూర్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో బిఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య మాట్లాడారు. గుర్తింపు సంఘం పదవీకాలం ముగిసినందున తదుపరి ఎన్నికలు జరిగేంతవరకు ఏ ఒక్క సంఘానికీ ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వరాదని స్పష్టం చేశారు. కార్మికుల సమస్యలపై యాజమాన్యం నిర్వహించే అన్ని చర్చలు, సమావేశాలకు జాతీయ సంఘాలన్నింటినీ సమానంగా ఆహ్వానించాలని కోరారు. ఈ డిమాండ్లతో సెప్టెంబర్ 14న గని మేనేజర్లు, జనరల్ మేనేజర్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. సంస్థ వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించడంతో పాటు లాభాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిఎంఎస్ ఏరియా అధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి రాజారాం కిరణ్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

# శివాజీ మహారాజ్ ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లి సమాజానికి ఆదర్శంగా నిలువాలని శివాజీ మహారాజ్ సేవా సమితి జిల్లా అధ్యక్షులు లక్ష్మ ణ్ శివాజీ పాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గీతా భవన్ కార్యాలయంలో ఆదివారం జిల్లా సమావేశం నిర్వహించారు. మండల బాధ్యులందరూ సమావేశానికి హాజరై మాట్లాడారు. శివాజీ మహారాజ్ ఆలోచనలను, ఆదర్శాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఎక్కడైతే శివాజీ మహారాజ్ విగ్రహాలను ఏర్పాటు చేశారు ఆ కమిటీ అక్కడ పర్యవేక్షణ చేయాలని, అదేవిధంగా మండల స్థాయిలోని శివాజీ ఆలోచనలను, ప్రతి గ్రామీణ ప్రాంతంలోనూ ప్రతి గ్రామానికిశివాజీ మహారాజ్ ఆదర్శమైన ఆలోచనలను ముందుకు తీసుకెళుతూ యువతను చెడు మార్గంలో వెళ్లకుండా సన్మార్గంలో వెళ్లేందుకు వారికి ప్రతినెల సమావేశం ఏర్పాటు చేసుకుని ప్రతి కుటుంబాన్ని సాంప్రదాయబద్ధంగా, ముందుకు తీసుకెళ్లేందుకు గ్రామీణ స్థాయి నుండి ప్రతిఒక్కరూ సన్నద్ధం కావలన్నారు. కార్యక్రమంలో రవికుమార్, దుర్గాప్రసాద్, రాజేశ్వర్, అంబదాసు, దిగంబర్, కృష్ణపాటిల్, రాజు, సుభాష్, వెంకట్‌రెడ్డి, రాకేష్, సుధాకర్, ప్రశాంత్, రాజు, నవీన్,అరుణ్‌కుమార్, ప్రకాష్, శ్రీనివాస్, రాజయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

# క్రీడలతోనే ఉద్యోగుల్లో మానసిక ఉల్లాసం


**ప్రజాపక్షం / మందమర్రి :** క్రీడలు ఉద్యోగుల్లో మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని నింపుతాయని సీనియర్ పిఒ కార్తీక్ పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 62వ వార్షిక క్రీడలు, సాంస్కృతిక పోటీలు ఆదివారం స్థానిక సిఇఆర్ క్లబ్, సింగరేణి మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కార్తీక్, ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ నాయకులు ముల్కలపల్లి వెంకటేశ్వర్లు కలిసి లాంఛనంగా ప్రారంభించారు. నిరంతరం విధుల్లో ఉండే కార్మికుల్లో పని ఒత్తిడిని తగ్గించి నూతనోత్సాహం నింపేందుకే ఏటా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని కార్తీక్ తెలిపారు. చెస్, క్యారమ్ వంటి ఆటలు ఏకాగ్రతను, బాడీ బిల్డింగ్, లిఫ్టింగ్ పోటీలు శరీర దారుఢ్యాన్ని పెంచుతాయన్నారు. గెలుపోటముల కంటే పాల్గొనడం ముఖ్యమని, ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని చాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఇఆర్ క్లబ్ కార్యదర్శి పెద్దపల్లి బాణయ్య, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివకృష్ణ, జనరల్ కెప్టెన్ శ్రీను, ఉద్యోగులు పాల్గొన్నారు.

# టిఆర్‌టిఎఫ్ రాష్ట్ర మహిళా కార్యదర్శిగా సుంక ప్రేమలత



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ఉపాధ్యాయ ఉద్యమాలలో క్రియాశీలకంగా ముఖ్య భూమిక పోషిస్తున్న సుంక ప్రేమలతను తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ ( టిఆర్టిఎఫ్ ) మహిళా రాష్ట్ర కార్యనిర్వహక్కు కార్యదర్శిగా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కటకం రమేష్,అంజిరెడ్డి గారలు నియమించినట్లు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దర్శనం దేవేందర్, గడ్డం భూమన్న లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె విద్యారంగ, ఉపాధ్యాయరంగ సమస్యలతో పాటు,మహిళా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో క్రియాశీలకంగా ముందు వరుసలో నిలబడాలని ఆకాంక్షించారు.భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించి, విద్యాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని వారు కోరారు.

# ఐఎంఎ నిర్మల్ శాఖ అధ్యక్షుడిగా డాక్టర్ గడపాలె రమేష్ ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) నిర్మల్ శాఖ నూతన అధ్యక్షునిగా సీనియర్ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గడపాలె రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐఎంఎ ప్రాంగణంలో నిర్వహించిన ఎన్నికల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సంస్థ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు,కోశాధికారిగా డాక్టర్ కావేటి శ్రీకాంత్ ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ వేణుగోపాల కృష్ణ,డాక్టర్ జీకే ప్రశాంత్,జాయింట్ సెక్రటరీలుగా డాక్టర్ మహేష్ బాబు, డాక్టర్ సుధీర్ కుమార్, మహిళా విభాగం ప్రతినిధిగా డాక్టర్ అనిత రామకృష్ణ బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే స్టేట్ కౌన్సిల్ మెంబర్లుగా డాక్టర్ అప్పల చక్రధారి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రమణ గౌడ్, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్లుగా డాక్టర్ సురేష్, డాక్టర్ ఎం. ప్రభాకర్ రావు ఎంపిక కాగా, గౌరవ సలహాదారుగా డాక్టర్ దామెర రాములును ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఐఎంఎ సీనియర్ నాయకులు డాక్టర్ చక్రధారి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోనే నిర్మల్ ఐఎంఎ అందిస్తున్న వైద్య సేవలు అత్యున్నత స్థాయిలో ఉన్నాయని కొనియాడారు. సమిష్టి నిర్ణయంతో ఏకగ్రీవ ఎన్నికలు జరగడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

# పరామర్శించిన ముధోల్.. ఎమ్మెల్యే రామారావు పటేల్



**ప్రజాపక్షం/భైంసా :** భైంసా పట్టణం లోని పురాణ బజార్ లో బి జె పి నాయకులు అశోక్ లడ్డా కుమారుడు హనుమాన్ లడ్డా నిన్న అనారోగ్యం తో మృతి చెందడం తో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ పరామర్శించారు.మృతి కి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పలువురు నాయకులు ఉన్నారు.

# నిమజ్జనంలో డిజెలకు అనుమతి లేదు

**ప్రజాపక్షం/జైపూర్ :** గణేష్ నిమజ్జన వేడుకల్లో డీజేల వినియోగానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని జైపూర్ ఎస్ఐ భూమేష్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో డీజే నిర్వాహకులు, యజమానులతో శనివారం సమావేశం నిర్వహించి వారిని బైండోవర్ చేశారు. నిబంధనలు అతిక్రమించి డీజేలు ఏర్పాటు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జరుపుకోవాలని ఆయన సూచించారు.

# 18 సంవత్సరాలుగా మట్టి విగ్రహాలు..
# పంపిణీ చేస్తున్న పర్యావరణ ప్రేమికుడు


### పర్యావరణ పరిరక్షణ తన ధ్యేయం ఉంటున్నా వైనం




**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సమస్త మానవాళితో పాటు భూమి మీద ప్రతి జీవికి బ్రతికే హక్కు ఉంటుందని మానవుడు చేసే వికృత చేష్టలతో వాటి మనుగడకు భంగం కలుగకూడదని ముఖ్య ఉద్దేశంతో పర్యావరణ పరిరక్షణకు పూనుకున్నాడు సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్ కు చెందిన యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు సామాజిక కార్యకర్త తుమ్మ రాజ్ కుమార్. తుమ్మ రాజ్ కుమార్ గత 17 సంవత్సరాల క్రితం తానే స్వయంగా తన ఇంటి వద్ద వారి కుటుంబీకులు స్థానికుల సహాయంతో 200 మట్టి విగ్రహాలను తయారు చేసి ఉచితంగా పంపిణీ చేశారు.ఉచిత మట్టి వినాయక విగ్రహాలు ఈ సంవత్సరం అనగా 18వ సంవత్సరం 1500 మట్టి వినాయక విగ్రహాలను భక్తులకు పంపిణీ చేయడం జరుగుతుంది. మా ఫౌండేషన్ యొక్క ముఖ్య లక్ష్యం సగటు మానవుడు జీవించేటప్పుడు బ్రహ్మ దేవుని వద్ద ఏమేమి వరాలు తీసుకొని వస్తాడు అలాగే ఈ సృష్టిలో జీవించబడే ప్రతి జీవికి అలాంటి వారాలే ఉంటాయి. కాబట్టి మనకు నీటిలో మనకు తెలియని జీవరాశులు ఎన్నో జీవిస్తూ ఉంటాయి. ఈ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి ఇంటింటా వాడవాడనా ఊరూరా గణపతి పూజలు జరపడం జరుగుతుంది దానిలో భాగంగా ప్లాస్టిక్. రసాయనలతో కూడిన విగ్రహాలను తయారు చేసి తొమ్మిది రోజులు పూజలు జరిపి తదనంతరం మన గ్రామాలలో ఉండే చెరువుల వద్ద నిమజ్జనం చేయడం జరుగుతుంది దానిలో భాగంగా కెమికల్స్ తో కూడిన వినాయకులను నీళ్లల్లా వేయడం వల్ల నీటి కాలుష్యం పెరిగిపోయి అందులో ఉన్న జీవరాశులు మరణిస్తాయని దానిని కాపాడాలన్న సంకల్పంతోటి మా ఫౌండేషన్ ద్వారా మొదట మా ఇంటి వద్ద 200 విగ్రహాలను తయారు చేయించి ఇంటింటికి ఇవ్వడం జరిగినది అప్పుడు ప్రారంభించిన ఈ మట్టి వినాయక విగ్రహాలను కొంచెం కొంచెం అభివృద్ధి చేసుకుంటూ గత 9 సంవత్సరాలుగా 1500 నుండి 2000 మట్టి వినాయక విగ్రహాలను సుల్తానాబాద్ పట్టణంలో యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షులు తుమ్మ రాజ్ కుమార్ సొంత డబ్బులతోటి ఈ యొక్క వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం జరుగుతుంది.ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ రసాయనాలతో కూడిన విగ్రహాలను తయారు చేసేది నిషేధం విధించి మట్టి వినాయక విగ్రహాలకు ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందించి ఈ సృష్టిలో ఉన్న ఎన్నో జీవరాశులను నీటి కాలుష్యాన్ని కాపాడే విధంగా ఉండాలని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తుమ్మ రాజ్ కుమార్ కోరుతున్నారు.అదేవిధంగా మనందరం ఐక్యంగా ఉండి ఇప్పటికైనా రసాయనాలతో కూడిన విగ్రహాలను గాని వాడలల్లో గాని పెట్టి పూజించకుండా మనమే చైతన్యవంతులమై ప్రతి ఇంటింటా వాడ వాడ ఊళ్ళల్లో మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని కోరారు.

## ఊషన్నపల్లి పాఠశాలలో రూ. 21 వేలతో పెయింటింగ్ చేయించిన : స్వర్ణలత

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి ఆంగ్ల మాధ్యమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అదే పాఠశాలలో పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయురాలు ఈజె స్వర్ణలత తన కూతురు కీర్తిశేషులు మాధన శాంతి ప్రియ జ్ఞాపకార్థం రూ. 21 వేలు ఖర్చు చేసి, నూతన భవనాల వరండాలోని గోడలకు బొమ్మలు,అక్షరాలు రాయించారు. పాఠశాల గోడలను అందంగా తయారు చేయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య పాఠశాలలో బొమ్మలు వేయించి, పదాలు నేర్చుకుందాం, వర్డ్ వాల్ పదాలను రాయించాల్సిందిగా ఈజే స్వర్ణలతను కోరగా, ఆమె స్పందించారు. రూ. 21 వేలతో ఊషన్నపల్లి పాఠశాల గోడల మీద చక్కని రంగు రంగుల బొమ్మలు,తెలుగు ఇంగ్లీష్ అక్షరాలు,పదాలను రాయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య కోరిక మేరకు, తన కూతురు మాధన శాంతి ప్రియ జ్ఞాపకార్థంగా, పాఠశాల పిల్లలకు ఉపయోగకరంగా ఉండేందుకు ఈ పెయింటింగ్ చేయించినట్లు స్వర్ణలత తెలిపారు. ఆమె ప్రస్తుతం సుల్తానాబాద్ లో నివాసం ఉంటున్నారు. అడగ్గానే స్పందించి పాఠశాల వరండా గోడలపై చక్కని పెయింటింగ్ వేయించిన ఈజే స్వర్ణలతకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఎంతో దూరంలో ఉన్న స్వర్ణలత పెయింటింగ్ వేయించడం గొప్ప విషయమని,స్థానికంగా ఉన్న దాతలు కూడా స్పందించాలని ఆయన కోరారు. ఇంకా మూడు తరగతి గదుల్లో పెయింటింగ్ వేయించాల్సి ఉందని,దాతలు స్పందించి,పెయింటింగ్ వేయించడానికి సహకారం అందించాలని,ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య కోరారు.ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, అందరి సహకారం ఉంటేనే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని ఆయన అన్నారు.





## మట్టి వినాయకుల విగ్రహాల పంపిణి

**ప్రజాపక్షం/పాలకుర్తి :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఘన్‌శ్యామ్‌దాస్‌నగర్‌లోని యూనివర్సల్ ఐఐటినీట్ ఫౌండేషన్ ఉన్నత పాఠశాలలో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని తాము తయారుచేసిన మట్టి గణపతి విగ్రహాలను విద్యార్థులు గ్రామంలో పంపిణి చేశారు. విద్యార్థులు స్వయంగా మట్టితో తయారుచేసిన విగ్రహాలను తెచ్చి పాఠశాలలో ప్రదర్శించారు. ఉత్తమ విగ్రహాలకు పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు గణపతి విగ్రహాలకు పూజలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి 'మట్టి గణపతి విగ్రహాలను పూజించండిపర్యావరణాన్ని పరిరక్షించండి' అంటూ మట్టి విగ్రహాలను ప్రజలకు పంపిణి చేశారు. పాఠశాల కరస్పాండెంటు మహమ్మద్ ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అఫ్జల్‌లు విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు.

## అడవి శ్రీరాంపూర్‌లో ఊరపందుల స్వైరవిహారం

### పట్టించుకోని అధికారులు!



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల పరిధిలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో ఊర పందుల బెడద తీవ్ర రూపం దాల్చింది. గ్రామంలోని వీధులు, నివాస ప్రాంతాలలో పందులు గుంపులు గుంపులుగా స్వైరవిహారం చేస్తుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**రోగాలు వ్యాపించే ప్రమాదం – భయాందోళనలో ప్రజలు :** గ్రామ వీధుల్లో పందులు సంచరిస్తూ,ఇళ్ల పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల కాల నీల్లో దుర్వాసన వెదజల్లడమే కాకుండా,చిన్నపిల్లలు, వృద్ధులు అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. పందుల సంచారం కారణంగా రాత్రి వేళల్లో బయటకు రావాలంటేనే మహిళలు, చిన్నారులు బెంబేలెత్తిపోతున్నారు.అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహంగ్రామంలో పందుల బెడద ఇంతలా ఉన్నా, పంచాయతీ అధికారులు కానీ, ఉన్నతాధికారులు కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.తక్షణమే చర్యలు చేపట్టాలిఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, అడవి శ్రీరాంపూర్ గ్రామంలో పందుల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని, గ్రామస్తులను ఈ ఇబ్బందుల నుండి విముక్తి చేయాలని స్థానిక ప్రజలుడిమాండ్ చేస్తున్నారు.

## షిర్డీలో తెలంగాణ చిన్నారుల కూచిపూడి నృత్యం


### ప్రేక్షకులను ఆకట్టుకున్న ప్రదర్శన



**ప్రజాపక్షం/బెల్లంపల్లి టౌన్ :** మహారాష్ట్రలోని షిర్డీ సాయిబాబా మందిర ప్రాంగణంలో తెలంగాణ చిన్నారులు కూచిపూడి నృత్యంతో అలరించారు. స్నేహ ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో బెల్లంపల్లికి చెందిన నాట్య గురువు పేరాల అర్చన జయప్రకాశ్ శిక్షణలో విద్యార్థులు ప్రదర్శన ఇచ్చారు. చిన్నారులు ప్రదర్శించిన హావభావాలు, నృత్య భంగిమలు భక్తులను, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భారతీయ శాస్త్రీయ నృత్యంపై చిన్నారుల్లో ఆసక్తిని పెంపొందించి సంస్కృతిని కాపాడటమే తమ లక్ష్యమని, షిర్డీ వంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో ప్రదర్శన ఇవ్వడం ఎంతో గర్వంగా ఉందని నాట్య గురువు తెలిపారు. అనంతరం చిన్నారులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ నిర్వాహకులు కాంపల్లి శంకర్ రాజేశ్వరీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జపాన్ విద్యా విధానం ఎంతో ఆదర్శం

### ఉపాధ్యాయురాలు హదియా బేగం



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** జపాన్‌లో విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే బృందపని, క్రమశిక్షణ, పరిశుభ్రత, స్వయం సమృద్ధి వంటి విలువలను పెంపొందించే విధానం ఎంతో స్ఫూర్తిదాయకమని కాగజ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు హదియా బేగం తెలిపారు. విద్యా మార్పిడి అధ్యయన పర్యటనలో భాగంగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, ఓపెన్ స్కూల్ డైరెక్టర్ లింగయ్యతో కలిసి ఆమె ఇటీవల జపాన్‌లో పర్యటించారు. జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ సెంటర్ ఆధ్వర్యంలో చియోడా ఎలిమెంటరీ స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ సుకుబా స్పెషల్ నీడ్స్ స్కూల్ తదితర విద్యాసంస్థలను పరిశీలించారు. విద్యార్థులు తమకు తామే మధ్యాహ్న భోజనం వడ్డించుకోవడం, తరగతి గదులను శుభ్రం చేసుకోవడం వంటి పనులను స్వయంగా నిర్వహించడం విశేషంగా ఆకట్టుకుందని హదియా బేగం పేర్కొన్నారు. ఒత్తిడిలేని, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు జ్ఞానాన్ని ఆర్జిస్తున్నారని వివరించారు. అక్కడ గమనించిన క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలను మన విద్యార్థుల్లోనూ అలవరిచేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## సన్న వరి సాగుదారులకు రూ.500 బోనస్

### వ్యవసాయ విస్తరణ అధికారి కిరణ్మయి



**ప్రజాపక్షం/మందమర్రి :** సన్న రకం వరి సాగు చేస్తున్న రైతులు ప్రభుత్వం ఇచ్చే రూ.500 బోనస్ పొందేందుకు ఈ నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని మందమర్రి వ్యవసాయ విస్తరణ అధికారి కిరణ్మయి సూచించారు. సన్న రకాల సాగును ప్రోత్సహించడంతో పాటు రైతులకు అదనపు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం బోనస్ అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ఏడు రకాల సన్న వడ్లను పండిస్తున్న రైతులు మాత్రమే ఈ ప్రయోజనానికి అర్హులని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో పంట వివరాలు నమోదు చేసుకున్న వారికే బోనస్ అందుతుందని, గడువు దాటితే అవకాశం కోల్పోతారని హెచ్చరించారు. రైతులు వెంటనే సంబంధిత పంట డీలర్లను సంప్రదించి వివరాలు సమర్పించాలని కోరారు. అర్హులైన ప్రతి రైతు నిర్లక్ష్యం చేయకుండా గడువులోగా ప్రక్రియ పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.